# రమణ భాస్కర

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 26-1-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనభారతీయ సంస్కృతికి మూలం తపస్సు. పూర్వం చదువుకొన్నవారు ఉన్నారు. ఇప్పుడు కూడా చదువుకొన్నవారు ఉన్నారు. పూర్వం చదువులకి, ఇప్పటి చదువులకి తేడా ఉంది. పూర్వం చదువుకి చదువు ఉండేది, తపస్సు ఉండేది. ఇప్పటి చదువులకి చదువు ఉంది, తపస్సు లేదు. తపస్సుతో కూడిన విద్యరాణిస్తుంది. తపస్సులేని చదువు రాణించదు. సమాజానికి ఉపయోగపడదు. చదివిన వ్యక్తికి తపస్సు ఉంటే ఆ మాటకు బరువు ఉంటుంది, ఆ మాటయొక్క ప్రభావము సమాజము మీద పనిచేస్తుంది. మనం ఎంతో కొంత చదువుకొంటున్నాము గాని తపస్సు చేసే ఓర్పు, సహనం మనకి తగ్గింది. అందువలన తపస్సు చేయలేకపోతున్నాము. అందుచేత చక్రాలు, మంత్రాలు అని ఇటువంటి గొడవలలోనికి దిగుతున్నాము. తపస్సుయొక్క ప్రయోజనం మోక్షం. మనస్సును ఏకాగ్రం చేయటమే తపస్సు. మనం పెట్టుకొనే నియమాలు అన్నీ కూడా తపస్సులో భాగమే. ఆహారనియమము, వాక్కులోనియమము ఇవి కూడా తపస్సు.

ఈ దేహము, మనమనస్సులో వచ్చే వికారములు శాశ్వతం కాదు. ఇవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. ఆత్మజ్ఞానము వలన వచ్చే అనుభవం మాత్రం శాశ్వతంగా ఉంటుంది. జ్ఞానంలో రెండు రకాలు ఉన్నాయి. సత్యజ్ఞానంవలన సత్యం తెలుస్తుంది. రెండవది ఆభాసజ్ఞానము అంటే ఇంద్రియాలతో సంపాదించేజ్ఞానము దీని వలన సత్యం తెలియదు.ఆత్మజ్ఞానము కలిగేవరకూ ప్రతీ మానవుడిని దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. మనకు జ్ఞానం కలగకుండా రెండు అడ్డువస్తున్నాయి. 1) మమకారం 2) అహంకారం ఇవి రెండూ మనస్సులో ఉన్న రోగాలు. మన దుఃఖానికి ఇవే కారణం. ఈ రెండు రోగాలు తగ్గితే గాని మనస్సు అంతర్ముఖం కాదు. ఇవి రెండు ఉన్నంత కాలం మనస్సు ఎక్కడయితే పుట్టిందో అక్కడకు వెళ్ళి లయం కాదు. ఈ రెండురోగాలకు మందులు ఏమిటి అంటే త్యాగం వలన మమకారం తగ్గుతుంది. ఆత్మజ్ఞానము వలన అహంకారం తగ్గుతుంది. ప్రకృతిలక్షణాలు మనలో ఉన్నంతకాలం మమకారం, అహంకారం పెరుగుతూ ఉంటాయి. రామచంద్రమూర్తికి, రమణమహర్షికి ఎటువంటి కల్యాణగుణాలు ఉన్నాయో అటువంటి గుణాలవలన మమకారం, అహంకారం తగ్గుతుంది, ఆత్మతెలియబడుతుంది. మనకి ఉన్నవి అన్నీ ప్రకృతిగుణాలు కాని ఆత్మగుణాలు ఉన్నాయి అని మనం అనుకొంటూ ఉంటాము. మనం ఏ స్థాయిలో ఉన్నామో మనకు తెలియదు, గురువుకి తెలుస్తుంది.

ఉన్నది ఒక్కటే, రెండుకాదు. అది తెలుసుకో. దానిని తెలుసుకొంటే ఇంక తెలుసుకోవలసినది ఏమీలేదు. అంటున్నారు భగవాన్. లోకంలోని గొడవలను నెత్తిన్నుకోవటం వలన ప్రయోజనం ఏమీలేదు. అవి అన్నీ స్వప్న సమానము. ఉన్నది ఒక్కటే. అది ఎవరో అనుకొంటున్నావేమో అది నువ్వే. అది నీవే అన్నసంగతి నీకు తెలియటంలేదు. అది తెలుసుకో నీవు సుఖివిఅవుతావు. ఇంక పునర్జన్మలోనికి రానక్కరలేదు. నీకు ఆత్మశాంతి కలగనంతకాలం ఈ తంత్రాలు, యంత్రాలు, చక్రాలకు ఆకర్షించబడతావు. ఏది కనబడితే అదే

నిజం అనుకొని దాని వెనకాల పరిగెడుతూనే ఉంటావు. నేను ఎవరోనాకు తెలియనపుడు ఎవరైనా ఏదైనా చెపితే దాని మీద ఆకర్షణ కలుగుతుంది. జ్ఞానికి ప్రపంచంలో దేనిమీద ఆకర్షణ కలుగదు. భగవాన్ దగ్గరకు ఒకస్వామి వచ్చి నేను మంత్రం ఇస్తాను చేసుకోండి అని చెప్పాడు. అప్పుడు భగవాన్ నాకు మంత్రం చేసే అలవాటు లేదు. మంత్రాలు చేసేవారు చాలామంది ఉన్నారు వారికి మంత్రం ఇవ్వండి వారు చేసుకొంటారు అని చెప్పారు. తను ఎవరో తనకు తెలిసినపుడు ఈ మంత్రాల మీద, యంత్రాలమీద, లౌకిక విషయాల మీద ఆధారపడవలసిన పని లేదు. మంత్రం చేసుకోవచ్చు. నీ మనస్సు ఎంత నిజమో ఆ మంత్రాలు కూడా అంతే నిజం.

భక్తి అంటే భగవంతుని పట్ల గౌరవము. ప్రేమ కలిగి ఉండటం. భగవంతునితో మానసిక అనుబంధం కలిగి ఉండటం. శ్రద్ధ వలన భక్తి కలుగుతుంది. పూర్ణశరణాగతి వలన మనస్సు పూర్ణంగా అణిగిపోతుంది అని చెప్పారు. మీ కాలాన్ని, శక్తిని పాడుచేసుకోవద్దు. మరణానంతరము మనం సాధన చేయటానికి అవకాశం లేదు. మనం పొందవలసినది మనహృదయంలోనే ఉంది. మనస్సు బయటకు వెళుతూ ఉంటుంది, లోపలకు వస్తూ ఉంటుంది. మనస్సు బాహ్యముఖానికి విజృంభించినపుడు అదే అహంకారముగా మారుతుంది. మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే, హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తూ ఉంటే అదే ఆత్మ అయిపోతుంది. నేను యొక్క మూలాన్ని వెతకటమే తపస్సు. అహంమూలాన్వేషణయే తపస్సు అని భగవాన్ చెప్పారు.

ఒక మనిషికి స్వార్థం పెరుగుతూ ఉంటే ప్రేమ తగ్గుతుంది. ప్రేమ పెరుగుతూ ఉంటే స్వార్థం తగ్గుతుంది. మనం భగవంతునికి దూరం అవ్వటానికి మన స్వార్థబుద్ధే కారణం. ఎంత దూరమై పోతున్నాము అంటే అసలు భగవంతుడే లేడు అని మనకు అనిపిస్తుంది. భగవంతుడు తెలియకపోయినా నీకు మనస్సు తెలుస్తోందికదా. నీ మనస్సు యొక్క మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. నీ హృదయంలో ఉన్న భగవంతుడు నీకు తెలియనంతకాలం నీకు చదువు ఉన్నా, చదువు లేక పోయినా మూర్ఖత్వం నిన్ను విడిచిపెట్టదు. భగవంతునితో అనుసంధానము చేసేదే నిజమైన విద్య. భగవంతుడు భూమి మీదకు రోజు ఏమి వస్తాడు. భక్తులరూపంలో, జ్ఞానులరూపంలో మనకు దర్శనమిస్తూఉంటాడు. ఎవరి సమక్షంలో కూర్చొంటే నీ ప్రయత్నం లేకుండా, సాధన లేకుండా నీ మనస్సు జ్ఞానంవైపుకు, శాంతివైపుకు మళ్ళించబడుతుందో వాడే నీ గురువు అన్నారు. రాగద్వేషములు చాలా క్రూరంగా ఉంటాయి. మనం సాధన చేసేకొలది వాటి శక్తిని చూపిస్తూ ఉంటాయి. నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నావో దాని వంక చూడకు. ఏదైతే నువ్వు అవుదామనుకొంటున్నావో దాని వంక చూడు అన్నారు భగవాన్. నాకు రాగం పోవాలి, ద్వేషంపోవాలి అనుకోవటంకూడా తలంపే. ఆతలంపులకు ఎవరు ప్రాణం పోస్తున్నారు. నువ్వే పోస్తున్నావు. నేను అనే మొదటి తలంపే వాటికి ప్రాణంపోస్తోంది. రాగద్వేషాలకు ఏ నేను అయితే ప్రాణం పోస్తోందో ఆ నేనును భగవంతునికి అర్పించు.

నిరంతము నన్ను స్మరించు, నన్ను ప్రేమించు నీ యోగక్షేమములు చూసే బాధ్యత నాది అని భగవంతుడు చెపుతున్నాడు. నన్ను ఒక్కడినే శరణువేడుకో నీ మనస్సు నశించి తీరుతుంది. అంటే భగవంతునిపట్ల సజీవమైన విశ్వాసం కలిగి ఉండాలి. మోక్షం అంటే ఏదో అనుకోవద్దు నీ సహజస్థితే మోక్షం. జ్ఞాన మార్గము పట్ల ఆకర్షణ కలగకపోతే భక్తిమార్గములో ప్రయాణం చేయవచ్చు. ఏ మార్గంలో ప్రయాణం చేసినా పోగొట్టుకోవలసినది దేహగతమైన నేనునే. అహంకారం ఉంటే అన్నీ ఉన్నాయి. అది

లేకపోతే ఏదీలేదు. ఉన్నది చైతన్యం ఒక్కటే. ఉన్నది అదే. అది రెండు కాదు. దానిని తెలుసుకొన్న తరువాత నువ్వు తెలుసుకోవటానికి ఏమీ మిగలదు. నువ్వు సత్కర్మ చేస్తూ ఉంటే, సత్పురుషులతో సహవాసం చేస్తూ ఉంటే నీ మనస్సు భగవంతునివైపుకు తిరుగుతుంది గాని లేకపోతే తిరగనే తిరగదు. మన మనస్సుకు ఏకాగ్రత వస్తే, పవిత్రత వస్తే మన హృదయంలో ఉన్న దేవుడే మనకి మౌనంతో బోధిస్తూ ఉంటాడు. గురుభక్తి లేకపోతే దైవభక్తి కలుగదు. గురుభక్తి ఎందుకు అవసరం అంటే దేవుడి దగ్గరకు నిన్ను తీసుకొనిపోయేవాడు గురువు మాత్రమే.

నీవు మాట్లాడే మాటను భగవంతుడు చూడడు. ఆ మాటను ఏ తలంపు ప్రేరేపిస్తోందో ఆ తలంపును భగవంతుడు చూస్తాడు. తలంపునుబట్టి మాట్లాడతాము. తలంపును బట్టి పని చేస్తాము. తలంపును నియమించుకొంటే మంచి మాటలు వస్తాయి. మంచి పనులుచేస్తాము. తలంపులవిషయంలో జాగ్రత్తగా ఉంటే మీ ఆధ్యాత్మిక పురోగతికి అవి సహకరిస్తాయి. మనస్సులో అనేక ఊహలు, గొడవలు, సంఘటలను మోస్తూ ఉంటాము. ఏ విషయాలను అయితే ఎక్కువగా తలపెట్టుకొంటూ ఉంటామో ప్రాణంపోయేటప్పుడు అవే వచ్చి శిరస్సులో కూర్చొంటాయి. దానినిబట్టి పునర్జన్మ నిర్ణయింపబడుతుంది. మీరు మంచి పని చేసినా అది మర్చిపోతే మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. అది మర్చిపోకపోతే కర్తృత్వబుద్ధి పెరుగుతుంది. హృదయం ఖాళీ అయినవాడికి కాని జ్ఞానం కలుగదు. భగవంతునికి తెలుసుకోవటానికి అడ్డువచ్చేది దేహగతమైన నేనే. ఏ నేనును అయితే తొలగించుకోవటానికి సాధన చేస్తున్నామో దానిని పెంచుకోవటం వలన జ్ఞానం కలుగదు. ఈ నేనును తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే అది విజృంభిస్తూ ఉంటుంది, దాని శక్తి ఎంత ఉందో అంత శక్తిని మీ పట్ల చూపిస్తుంది. ఆ శక్తిని మీరు తట్టుకోవాలి. మీరు ఎప్పుడైనా కోపమును తొలగించుకోవాలి అని అనుకొంటారు అనుకోండి. ఎన్నో జన్మలనుండి నీ కూడా వస్తున్నాను ఈ వేళ అక్కరలేదా అయితే నా శక్తిని చూపిస్తాను అంటుంది. ఏ గుణాన్ని అయితే మీరు తొలగించుకోవాలి అనుకొంటున్నారో దాని శక్తిని అంతా చూపించి కాని అది బయటకు వెళ్ళదు.

అహంకారంతో పోరాడేటప్పుడు అహంకారం ఓడిపోవచ్చును లేకపోతే మనం ఓడిపోవచ్చును. ఎవడిచేతిలోఅయితే అహంకారం ఓడిపోయిందో వాడు జ్ఞాని అవుతాడు. లేకపోతే పామరుడు. ప్రపంచాన్ని జయించినవాడు ఋషి అవ్వడు. తన మనస్సును జయించినవాడు, తనను తాను నియమించుకొన్నవాడు ఋషి. నువ్వు డైరెక్టుగా గుణాలను పేస్ చేయటం కష్టం. అందువలన నిరంతరము భగవంతుని ప్రేమిస్తూ ఉంటే, నిరంతరము నీ మనస్సును భగవంతుని చుట్టూ తిప్పుతూ ఉంటే కూర్చున్నా, నడుస్తున్నా, తింటున్నా భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, అయ్యో వారు నాకోసం జీవిస్తున్నారు అని భగవంతుడు అనుకొంటే పుట్టిన దూడను ఆవు ఏ విధంగా నాకు తుందో అలాగ భగవంతుడు నీ కామ క్రోధములను నాకేస్తాడు. భగవంతుడు ఏదైనా ఒకమాట చెపితే ఆ మాట ఎందుకు చెప్పాడు, ఆ మాట మన శ్రేయస్సుకోరి చెప్పాడు కదా అని ఆ మాట యందు గౌరవం ఉంచి ఆ మాటను ప్రాక్టీసు చేయటానికి ప్రయత్నం చేయాలి. మనం ఏమి చేస్తాము అంటే మన అహంకారము చెప్పినట్లు పనిచేస్తాము, భగవంతుడు చెప్పిన పని చేయము. భగవంతుడు అంటే మనకు ఇష్టం ఉండదు మన అహంకారం అంటే మనకు ఇష్టం. భగవంతుడు చెప్పినట్లుగా నడుచుకొంటే భగవంతుడితో ఐక్యమవుతాము. చేప ఏ విధంగా నీటి ప్రవాహమునకు ఎదురు ఈదుతుందో అలాగ నీ మనోప్రవాహమునకు ఎదురు ఈదటం నేర్చుకో. నీ మనో ప్రవాహమునకు ఎదురు ఈదితే మనోమూలంలోనికి వెళ్ళిపోతావు.

మన మీద మనకు విశ్వాసం లేకపోతే అజ్ఞానముతో పోరాడలేము. జ్ఞానమును సంపాదించలేము. మనం ఎవరో మనం తెలుసుకోలేము. మనం ఎవరో మనకు తెలియనంతకాలం మనకు శాంతిలేదు. దేనినీ చూసి ఆశ్చర్యపడవద్దు. ఈరోజు సంహాసనం మీద కూర్చోవచ్చు. రేపు గుడిసెలో ఉండవచ్చు. ఇది అంతామాయ. దేహప్రారబ్ధం ప్రకారం అది ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది. దేనిని చూసి ఆశ్చర్యపడవద్దు. ఇది నేర్చుకో. వీటి గురించి నీ శక్తిని పాడు చేసుకోవద్దు. నీవు ఈభూమి మీదకు ఏ పనినిమిత్తం వచ్చావో ఆ పనిమీద నీ మనస్సును నిలబెట్టు.

చైతన్యమును ప్రేమించకుండా ప్రకృతి విషయాలను ప్రేమిస్తూ ఉంటే చైతన్యమును విడిచిపెట్టి ఎంతదూరం వెళతామో అంతదూరం వెనుకకువస్తేగాని నిజం తెలియదు. నిజంకానిదానిని మీరు ప్రేమించినా మీరు ప్రేమిస్తున్నారని అది నిజం అవ్వదు. నీవు చైతన్యాన్ని ప్రేమిస్తే గాని చైతన్యం నీకు అనుభవంలోనికి రాదు. చైతన్యం కాని దాని మీద అనురాగం పెట్టుకొన్నారు అనుకోండి. అనురాగం పెట్టుకొని చాలాదూరం వెళ్ళిపోయారు అనుకోండి. మరల అంతదూరం వెనుకకు వస్తే కాని నీకు చైతన్యానుభవం కలుగదు. గుహలు అన్నీ ప్రకృతిలో ఉన్నాయి. ప్రకృతితో సంబంధం లేని గుహ ఒకటి ఉంది అది హృదయగుహ. అక్కడే దేవుడు ఉన్నాడు. మన స్వరూపం నుండి మనం ఎంతదూరమైతే వెళ్ళిపోయామో మరల అంతదూరం వెనుకకు వస్తే గాని హృదయగుహలో ప్రవేశించలేము. ఇప్పుడు నీ మనస్సు శిరస్సులో ఎంత సహజంగా ఉంటోందో అంతసహజంగా నీ మనస్సు హృదయగుహలో ఉండగలిగితే, అలా జీవించటం నేర్చుకొంటే ఏ పని ఎప్పుడు ఎలా జరగాలో అలాసక్రమంగా జరిగిపోతూ ఉంటుంది. కర్మను త్యాగం చేయకు. కర్మఫలాన్ని త్యాగంచెయ్యి. ఏదో పని చేయటం వలన మోక్షంరాదు. కామ్యకర్మలు చేయటం వలన నీ మనస్సు అహంకారం అయి విజృంభిస్తుంది. జన్మలకు కారణం అవుతుంది. నిష్కామకర్మలు చేయటంవలన నీ మనస్సు దాని మూలంలోనికి వెళ్ళి దాని అంతట అది రాలిపోతుంది. ఫలితాన్ని ఆశించకుండా చేస్తే రెండులాభములు. ఫలితంవస్తుంది. మనస్సు పవిత్రం అవుతుంది. మనస్సు పవిత్రం అయినపుడు అది వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది.

భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. ఆయన అనుభవంలోనికి వచ్చే వరకూ మనకి శాంతిలేదు, సుఖంలేదు, ఆనందంలేదు. ప్రపంచంలో ఏదో వస్తువును ప్రేమించుకొంటూ వెళ్ళిపోతాము అనుకోండి, మరల వెనక్కి వస్తేగాని మీకు జ్ఞానం కలుగదు. నాకు ఇంకా గురువు దొరకలేదు అన్నాడు ఒక భక్తుడు భగవాన్ దగ్గరకు వచ్చి, ఈ భూమి మీదకు వచ్చిన ప్రతీ మనిషి రెండుపనులు చేయాలి. ఒకపని నీకు పూర్తి అయింది అన్నారు భగవాన్. అంటేనేనే నీగురువును అని చెప్పకుండా చెప్పటం. నేనే నీ గురువును అని ఆయన ఎవరితోనూ చెప్పరు కాని చేయవలసిన పని ఆయన లోపల చేసేస్తూ ఉంటారు. మనకి ఉపకారం చేస్తూ ఉంటాడు కాని వాడి ద్వారామనకు ఉపకారం జరుగుతోంది అని మనకి తెలియనీయడు వాడు సత్పురుషుడు అంటే, రమణభక్తులు అదృష్టవంతులు వారు పులి నోటిలో పడ్డ మాంసపు ముక్కలు. పులి నోటిలో పడ్డ మాంసపు ముక్క బయటకు రావటానికి అవకాశంలేదు అలాగే రమణమహర్షి అనుగ్రహంలో పడ్డవారు ఎక్కడ ఉన్నావారు తరించబడతారు కాని విడిచిపెట్టె సమస్యలేదు. నీకు బయటగురువు దొరికాడు. లోపల గురువును వెతికి పట్టుకోవాలి. లోపల గురువును ఎప్పుడైతే పట్టుకొన్నావో నీ పని పూర్తి అవుతుంది. లోపల గురువే చైతన్యం. అక్కడ రూపంలేదు, నామంలేదు మనకు రూపబుద్ధి ఉంది కాబట్టి లోపల ఉన్న చైతన్యమే కాళ్ళు, చేతులు తొడుక్కొని మనకు కనిపిస్తుంది. లోపల గురువు మన ప్రాణానికి ప్రాణమై ఉన్నాడు. మన హృదయం లోపల చాలా వికారములు ఉంటాయి. అవి తలంపులుగా మారి నీ శిరస్సులోనికి

వచ్చే వరకు నీకు తెలియదు. తలంపులుగా మారి నీ శిరస్సులోనికి వచ్చి నీకు కనబడక ముందే లోపల గురువు వాటిని చూస్తాడు. లోపల గురువు యొక్క వైభవం అది. పునర్జన్మ హేతువులు మన హృదయంలో చాలా ఉంటాయి. వాటిని కెలికి పునర్జన్మ హేతువులను శిరస్సులోనికి పంపుతాడు. నీలో ఏ బలహీనతలు అయితే ఉన్నాయో నీకు తెలియజేసి వాటి నుండి విడుదల పొందటానికి బయటగురువు సహాయం అందిస్తూ ఉంటాడు. నీ హృదయంలో ఉన్న బలహీనతలు అన్నీ బయటకు పోతేగాని పరమేశ్వరుడు నీకు వ్యక్తం కాడు. హృదయం ఖాళీ అవ్వకుండా ఎవడూ జ్ఞాని కాలేడు. గదినిండా సామాన్లు పెట్టి వచ్చి కూర్చోండి అంటే కూర్చోవటానికి ఖాళీ ఉండాలి కదా. అలాగే హృదయంలో ఖాళీ ఉంటే భగవంతుడు వచ్చి కూర్చొంటాడు. మంచి పనులు చేసి మర్చిపోండి. వాటిని మనస్సులో మోసుకొని తిరగవద్దు. మనస్సులో మోస్తూ ఉంటే వాటి వలన కొత్త వాసనలు వస్తాయి. మీ మనస్సును భోగప్రవృత్తిలో నుండి విడుదల చేయగలిగితే మీ ద్వారా అనేక మంచి పనులు జరుగుతాయి. అప్పుడు మీ ద్వారా సమాజమునకు మేలు జరుగుతుంది. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినపుడు నీవు వందవాసనలతో వస్తే శరీరం మరణించేలోపు కనీసం పది వాసనలు తగ్గించుకొంటే నీవు సాధన చేసినట్లే, ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించినట్లే. బహుజన్మల కృషివలన గాని జ్ఞానం కలుగదు అని భగవంతుడు గీతలో చెప్పాడు. కాని మనం ఏమిచేస్తున్నాము అంటే పది వాసనలు తగ్గించుకొనేబదులు దేహం మరణించేలోపు పది వాసనలు పెంచుకొంటున్నాము అంటే ప్రకృతి వైపుకు ప్రయాణం చేస్తున్నాము.

ధనం సంపాదించాలంటే ఎంతోకొంత కష్టపడాలి. నీ మనస్సును హృదయం లోనికి పంపడానికి నీ తెలివి ఒక్కటే సరిపోదు. అనేక సత్కర్మలు చేసి ఉండాలి. మనస్సు యొక్క విజృంభణను ఆపుకోవాలి. నాకు ఎవరైనా పండు ఇచ్చారు అనుకోండి తీసుకొంటే నాకు వస్తుంది. తీసుకోకపోతే వారి దగ్గరే ఉంటుంది. మిమ్మల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి. మీరు లోపలకు తీసుకోకండి. మిమ్మల్ని ఎవరైనా విమర్శించారు అనుకోండి అది కూడా లోపలకు తీసుకోకండి. తీసుకోకపోతే ఏగొడవ లేదు. తీసుకొంటే అదే మనస్సుగా మారిపోతుంది. ఏదైతే మనస్సుగా మారిపోయిందో అందులో నుండి విడుదల పొందటానికి మీరు సాధన చేయాలి. మనం చేసే సాధన గజస్నానం లాంటిది. ఏనుగు శుభ్రంగా స్నానం చేస్తుంది. గట్టుమీదకు వచ్చి బాడి చేసుకొంటుంది. అలాగే మనం ఏదో ఒక గంట పూజ చేస్తాము బయటకు వచ్చి మిగిలినకాలం అంతా లోకం గొడవలు నెత్తికెత్తుకొంటాము. ఇది బాగా అర్థం చేసుకోండి. నువ్వు తెలియకుండా చేసిన పొరపాటువేరు. నువ్వు బుద్ధిపూర్వకంగా చేసిన పొరపాటువేరు. నువ్వు తెలియకుండా చేసినపొరపాటులోనుండి తొందరగా బయటకు వస్తావుగాని బుద్ధిపూర్వకంగా చేసిన పొరపాటులోనుండి తొందరగా బయటకు రాలేవు. దానికి ఎక్కువ సాధన చేయాలి. పెద్ద మేకును గోడకు బాగా లోపలకు కొట్టాము అనుకోండి. ఎంత లోతుగా ఆమేకును కొట్టావో అంత ఎక్కువ బలంగా తీస్తేగాని అది బయటకురాదు. అలాగే బుద్ధిపూర్వకంగా చేసిన పొరపాటు అంత లోతులలోనికి వెళుతుంది. ఎంతో తపస్సు చేస్తేగాని అది బయటకురాదు. నీకు తెలియకుండా చేసిన పొరపాటు అంత లోతులలోనికి వెళ్ళదు, కొంత నామం చేసినా అది బయటకు వచ్చేస్తుంది.

శరణాగతి అనేది అంత తేలికగా కలుగదు. జన్మాంతర సుకృతం ఉండాలి, నీ పుణ్యాం నీకు కలిసిరావాలి. నీ పుణ్యాం ఇంకా పండు అయ్యే స్థితికి రాలేదు అనుకోండి నీమనస్సు వెళ్ళి హృదయగుహలో పడదు. కంగారు పడకండి. నీ పుణ్యాం ఇంకా పచ్చి పచ్చిగా ఉంటే మనస్సు అంతర్ముఖం కాదు. మీ పుణ్యాం అంతా పండు అయింది అనుకోండి సడన్‌గా నీ మనస్సు వెళ్ళి హృదయం యొక్క లోయలలో పడిపోతుంది.

సూర్యుడిని నీవు కనిపెట్టనక్కరలేదు. నీ మొఖం సూర్యుడు వైపు ఒక్కసారి త్రిప్పితే సూర్యుడు నీకు కనిపిస్తాడు. నీ మనస్సును హృదయం వైపుకు త్రిప్పు అక్కడ దేవుడు ఉన్నాడో లేడో నీకే తెలుస్తుంది. నీమనస్సును హృదయం వైపుకు త్రిప్పకుండా అక్కడ దేవుడు లేడు అంటే ఉన్నవాడు లేకుండా పోతాడా. నాది, నాది అనుకొనేదంతా నీదే అన్న సంగతి శరణాగతి చెందినవాడికి తెలుస్తుంది. సతతము స్మరణ వలన శరణాగతి సాధ్యమవుతుంది.

శరీరం మరణించటం వలన దుఃఖం ఆగదు. ఏ నేను అయితే నీ లోపల దుఃఖ పడుతుందో అది మరణిస్తేగాని దుఃఖం ఆగదు. మన శరీరం మరణించినంత మాత్రంచేత మోక్షం రాదు, శాంతి రాదు. నేను ఉన్నంత కాలం పునర్జన్మ వస్తూ ఉంటుంది. ఆనేను దేహం లేకుండా ఉండలేదు. శరీరం ఉండగానే దుఃఖం లేని స్థితికి ఎదిగి వెళ్ళిపోవాలి. మనస్సు అనే గడప దాటావు అనుకో అప్పుడు చైతన్యము నేనుగా నీకు వ్యక్తమవుతుంది. చైతన్యములో గుణంలేదు. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే ఆనందం. మనకు మరణం వస్తే గోల పెడతాము ఇంక ఈ శరీరం కనపడదని దుఃఖ పడతాము. ఎందుకంటే శరీరం ఉంటే భోగం అనుభవించవచ్చును. భోగ ప్రవృత్తి ఉన్నవాడికి శరీరం పోతుంది అంటే భయం. భోగ ప్రవృత్తి లేనివాడికి శరీరం ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి? అజన్మదుర్విషయ రహితునికి జపమేల, తపమేల ఓ రామా ! శ్రీరామా! అన్నాడు త్యాగరాజు. అనేకమంది పూజలగురించి చెప్పారు, వ్రతాల గురించి చెప్పారు, యాత్రలు గురించి చెప్పారు. ఎవరు దేనిగురించి చెప్పినా నామనస్సు దేనికి ఆకర్షింపబడలేదు అన్నారు భగవాన్. ఆవైభవం చూడండి. ఈ మధ్య పాలకొల్లు వెళ్ళాము అక్కడ గోడలోనుండి విభూతి రాలుతోంది అని అంటే అది జ్ఞానమా? నేను ఎవడినో నాకు తెలియనపుడు ఇటువంటి బుడబుక్కల కబుర్లకు ఆకర్షించబడతాను. భగవాన్ దగ్గరకు ఎంతోమంది గొప్ప గొప్ప వారు వచ్చారు కాని ఎవరూ ఆయనను ఆకర్షించలేదు. అది జ్ఞానం యొక్క వైభవం.

నేను అనే ప్రధమ తలంపు ఎక్కడయితే లేదో అక్కడ దేవుడు ఉన్నాడు. దేవుడు ఎవరో నీకు తెలియదు గాని నేను అనే తలంపు అందరికి ఉంది. అది ఉదయం ఎక్కడ నుండి లెగిసివస్తోంది, నిద్రపోయేటప్పుడు ఎక్కడకు వెళ్ళి అణిగి పోతోంది అని కొంచం చూడండి అంటున్నారు. ఈ నేను అనే తలంపు దేవుడు దగ్గర నుండి వస్తోంది అని మనకు అవగాహన కావటం లేదు. ఇది మనకు తెలియటానికి గురువు అవసరం. దేవుడు ఏసుఖాన్ని, శాంతిని, ఆనందాన్ని అనుభవిస్తున్నాడో అది మీచేత అనుభవింప చేసేవాడే గురువు. నేను యొక్క మూలాన్ని అన్వేషించటం చేతకాక, డైరెక్టుగా నిజాన్ని ఫేస్ చేయటానికి భయంవేసి యంత్రాలు, చక్రాలు, జపాలు, స్నానాలు అని ఇలా ఎన్ని జన్మలు తప్పించుకొంటావు అని భగవాన్ అడుగుతున్నారు. నువ్వు ప్రయత్నంచేయి దేవుని అనుగ్రహం వస్తుంది.

మీ అమ్మగారికి మోక్షం ఇచ్చారా అని భగవాన్‌ను అడిగితే ఒకరు ఒకరికి మోక్షమును ఇస్తారా ఆవిడ జ్ఞానమే ఆవిడకు మోక్షమును ఇచ్చింది అన్నారు భగవాన్. ఎటువంటి జ్ఞానము కలిగితే మనకు మోక్షం వస్తుందో అటువంటి జ్ఞానమును ఇచ్చేది గురువే. నేను ఇచ్చాను అని చెప్పకుండా ఆవిడ జ్ఞానమే ఆవిడకు మోక్షాన్ని ఇచ్చింది. అని చెప్పారు. అది గురువు యొక్క వైభవం. ఆవిడకు జ్ఞానమును ఇచ్చింది ఎవరు అంటే భగవాన్. అది చెప్పటం లేదు. అది మనం పట్టుకోవాలి.

(శ్రీ నాన్నగారి ప్రవచనములు మార్చి 1,2 తేదీలలో సఖినేటిపల్లి)

Ratna Printing works, Palakol. ✆ 22946